
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం । 20 । జూలై । 2025



సోమశిలలో 27.730 టీఎంసీలు

జలాశయంలో శనివారానికి 27.730 టీఎంసీలు ఉన్నాయి. 4,356 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టా, ఉత్తర, దక్షిణ కాలువలకు 5025 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,370
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,170
3 శాతం జీఎస్టీతో	రూ.9,445
నవర (8 గ్రా)	రూ.75,560

గరిష్ఠం/కనిష్ఠం
36.6 /28.0

వాతావరణం

జిల్లాకు ఆదివారం స్వల్ప వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. శనివారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రుస్తుం మైనింగ్ కేసులో మరొకరి అరెస్ట్

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి రుస్తుం మైనింగ్ అక్రమ కేసులో అరెస్ట్‌ల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ కేసులో ఏ–4 నిందితుడిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇదే కేసులో ఏ–12 నిందితుడిగా తోడేరు గ్రామానికి చెందిన ఏనుగు శశిధర్‌రెడ్డిను పోలీసులు చేర్చి శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని ఈ కేసులో 11 మందిని నిందితులుగా చేర్చిన విషయం తెలిసిందే. వారిలో కొందరిని ఇప్పటికే అరెస్ట్ కూడా చేశారు. తాజాగా శశిధర్‌రెడ్డిను నిందితుల జాబితాలో చేర్చి అదుపులోకి తీసుకున్నారు. శనివారం గూడూరు కోర్టు జడ్జి సమక్షంలో శశిధర్‌రెడ్డిను హాజరు పరచడంతో రెండు వారాలు రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు.

కావలి మున్సిపల్ కమిషనర్‌కు ఏసీబీ నోటీసులు

కావలి (జలదంకి): కావలి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న జి. శ్రావణ్‌కుమార్‌కు ఏసీబీ అధికారులు శనివారం నోటీసులు అందించారు. ఆయన గతంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో పలు అవినీతి ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. దీంతో 15 రోజుల్లో లిఖిత పూర్వకంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని శ్రావణ్‌కుమార్‌కు ఏసీబీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

చేపల వేట సాగిస్తే కఠిన చర్యలు



జలాశయం వద్ద పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారి సురేష్

సోమశిల: సోమశిల జలాశయంలో చేపల వేటకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మత్స్యశాఖ అధికారి సురేష్ తెలిపారు. జూలై 1వ తేదీ నుంచి జలాశయంలో వేటపై నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నపటికి కొందరు వేటగాళ్ల దొంగచాటుగా చేపలు పడుతున్నారనే సమాచారంతో శుక్రవారం రాత్రి ఆయన జలాశయం పరిసరాల్లో గస్తీ నిర్వహించారు. అక్రమంగా వేటకు పాల్పడుతూ మత్స్యకారులు పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 31వ తేదీ వరకు వేటపై నిషేధాజ్ఞలు ఉంటాయన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా పలువురి నియామకం


కొడవలూరు ధనుంజయరెడ్డి


కొండూరు అనిల్‌బాబు


కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి


బీరేంద్రవర్మ


ఓడూరు గిరిధర్‌రెడ్డి


కోడూరు కల్పలతారెడ్డి

నెల్లూరు (బారకాసు)/ తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన పలువురిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు పార్లమెంట్ పరిధికి జిల్లాకు చెందిన కొడవలూరు ధనుంజయరెడ్డి, కొండూరు అనిల్‌బాబులను, తిరుపతి జిల్లాకు చెందిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డి. బీరేంద్రవర్మ, ఓడూరు గిరిధర్‌రెడ్డి, కోడూరు కల్పలతారెడ్డిలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ, సంబంధిత రీజనల్ కో–ఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారులుగా వ్యవహరిచనున్నట్లు అందులో పేర్కొంది.

'వందేభారత్'పై రాయితో దాడి

- యువకుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వందేభారత్ రైలుపై రాయి విసిరిన యువకుడ్ని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు.. సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న వందేభారత్ రైలుపై వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ సమీపంలో రాయిని గుర్తుతెలియని యువకుడు శనివారం విసిరాడు. దీంతో కోచ్ అద్దం నెర్రిచ్చింది. రైల్వే సిబ్బంది ఫిర్యాదు మేరకు ఆర్పీఎఫ్, జీఆర్పీఎఫ్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా గంటల వ్యవధిలోనే ఘటనకు బాధ్యుడైన తోటపల్లిగూడూరు మండలానికి చెందిన బాలాజీని అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం.

ఉద్యమ నిర్వీర్యానికి కుట్రలు

ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కరేడు రైతు ఉద్యమాన్ని విభజించి నిర్వీర్యం చేసి, ఆ తర్వాత భూములు కొట్టేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. మూడు పంటలు పండే పచ్చని భూములను కాజేసి 'అమరావతి' తరహాలో భూ వ్యాపార వ్యూహంతో ప్రభుత్వ పెద్దలు కుతంత్రాలకు తెర తీస్తున్నారు. పార్టీలకు అతీతంగా భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామాలకే గ్రామాలే ఏకమయ్యాయి. కరేడు రైతులు చేపట్టిన ఉద్యమం రాష్ట్ర స్థాయికి చేరడంతో వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేందుకు కీలకంగా ఉండే మత్స్యకారులను తప్పించేందుకు పన్నాగం పన్నింది.

కరేడు భూములు కొట్టేసే పన్నాగం

- ఇండోసోల్ కంపెనీకి 8,348 ఎకరాలివ్వనున్నట్లు జీఓ
- 4,900 ఎకరాల సేకరణకే నోటిఫికేషన్
- అనధికారికంగా 20 వేల ఎకరాలు సేకరించాలని ప్రభుత్వ పెద్దల ఆదేశాలు
- ఉద్యమం నుంచి మత్స్యకారులను తప్పించేలా వ్యూహం
- మరో నోటిఫికేషన్ లేదంటూ ఎమ్మెల్యే బూటకపు ప్రకటనలు
- వైఎస్సార్‌సీపీ మద్దతివ్వడంతో ప్రభుత్వం కుతంత్రాలు



కరేడు రైతులకు అండగా పర్యటించిన పర్వతరెడ్డి, బుర్రా (ఫైల్)

ఉలవపాడు: కరేడు రైతులతో కూటమి ప్రభుత్వ పెద్దలు దాడుగుడుమూతల ఆటాడుతున్నారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో అవసరానికి మించి భూములు సేకరించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనే పన్నాగంతో ముందుకెళ్తున్నారు. ప్రాణాధారం, జీవనాధారమైన పచ్చని భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు సిద్ధంగా లేని కరేడు ప్రాంతం రైతులు పార్టీలకతీతంగా ఉద్యమిస్తున్న తరుణంలో బలవంతపు భూసేకరణ సాధ్యం కాదని అర్థమై అడ్డదారులు తొక్కుతున్నారు. ఉద్యమం నుంచి పార్టీలు, ప్రాంతాలను విభజించి నిర్వీర్యం చేసే కుట్రలకు పదను పెడుతున్నారు.

రాష్ట్రాన్ని తాకిన కరేడు రైతుల ఉద్యమం

ఇండోసోల్ కంపెనీకి అవసరమైన భూములను గత ప్రభుత్వ హయాంలోనే సేకరించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ భూములను కాదని కరేడు ప్రాంతంలో 8,348 ఎకరాలు ఇస్తున్నట్లు మార్చిలో జీఓ ప్రకటించింది. తొలివిడతలో 4,900 ఎకరాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, తర్వాత మిగిలిన గ్రామాల్లో 3,500 ఎకరాల భూములు సేకరణకు నోటిఫికేషన్ కూడా అధికారులు సిద్ధం చేశారు. దీంతో గత నెల 29న రైతులు పార్టీలకతీతంగా జాతీయ రహదారి దిగ్బంధం చేశారు. ఈ ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం రైతులు, రైతు నాయకులను పోలీసులతో ముందుస్తు అరెస్ట్‌లు చేయించింది. కేసులు బనాయిస్తామని రైతులను హెచ్చరించింది. అయితే ఆంక్షలను ఎదిరించి రైతులు వేల సంఖ్యలో తరలి రావడంతో ఈ ఉద్యమం రాష్ట్ర స్థాయికి చేరుకుంది.

మత్స్యకారులకు మాయమాటలు

ఈ ఉద్యమానికి వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలియజేయడంతో కూటమి ప్రభుత్వం ఏం చేయాలో అర్థంగాని పరిస్థితుల్లో గ్రామసభ నిర్వహించింది. గ్రామసభలో రైతులు భూములు ఇవ్వమని తేల్చి చెప్పారు. ఈ ఉద్యమంలో అలగాయపాళెం, బట్టిసోమయ్యపాళెం, టెంకాయచెట్లపాళెం, పల్లెపాళెం, కరేడు గ్రామాల్లోని మత్స్యకారులది కీలక పాత్ర. రాస్తారోకోలో, గ్రామసభలో వ్యతిరేకించడంలో ముందున్న మత్స్యకారులను ఉద్యమం నుంచి విడదీస్తే నీరుగారిపోతుంది.

తొలివిడత నోటిఫికేషన్‌లో ఈ మత్స్యకార గ్రామాల భూములు లేవు. రెండో విడతకు సిద్ధం చేసిన నోటిఫికేషన్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు టెంకాయచెట్లపాళెంలో పర్యటించి మత్స్యకార గ్రామాల భూములు ఎక్కడికీ పోవని, ఉద్యమానికి దూరంగా ఉండాలని చెప్పడంతోపాటు అధికార పార్టీలో ఉన్న నాయకులను ఉద్యమం వైపు వెళ్లకుండా కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న మత్స్యకారులను తప్పించి ముందు నోటిఫికేషన్‌లో ఉన్న భూముల సేకరణ చేస్తే తర్వాత ఈ గ్రామాల నోటిఫికేషన్‌ను జారీ చేయొచ్చనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని రైతులే అంటున్నారు.

రైతులతో దాగుడు మూతలు

భూసేకరణపై అధికారులు, ప్రజాప్రతినిధులు తలోరకంగా ప్రకటనలు చేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారు. తొలుత 8,348 ఎకరాలు సేకరిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా 4,900 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. కలెక్టర్ ఆనంద్ ప్రస్తుతానికి ఈ 4,900 ఎకరాలు మాత్రమే సేకరణ చేస్తామంటున్నారు. గడువు చెప్పడం లేదు. ఇదిలా ఉంటే 20 వేల ఎకరాలు సేకరించడానికి అధికారుల బృందాన్ని నియమించారు. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో మిగిలిన 11,500 ఎకరాలు సేకరించేందుకు చాపకింద నీరులా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో సముద్ర తీరం నుంచి హైవే వరకు భూములు తీసుకునే యత్నం సాగుతుందని సమాచారం. కానీ ఉద్యమాన్ని నీరుగార్చడానికి మత్స్యకార గ్రామాలు లేవని ఎమ్మెల్యే ఇంటూరి, కలెక్టర్ ఆనంద్ చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుతో..

కరేడు ప్రాంత రైతుల ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ మద్దతు ప్రకటించడంతో కూటమి ప్రభుత్వానికి గొంతులో వెలక్కాయ పడినట్లు అయింది. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించాక.. ఉద్యమాన్ని నీరుగార్చే కొత్త కుట్రలకు తెర లేపింది. పార్టీలకతీతంగా జరిగిన రాస్తారోకోలో సైతం 39 మందిపై కేసులు నమోదైతే 85 శాతం మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఉండడం విశేషం. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీలు తూమాటి మాధవ రావు, పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుకూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌లు పర్యటించి అండగా నిలవడంతో కరేడు రైతు ఉద్యమాన్ని చీల్చడానికి కూటమి నాయకులు కుట్ర ప్రారంభించారు. రైతుల జేఏసీకి తెలియకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఎందుకు కలిశారంటూ కరేడులో కూటమి నాయకులు రైతుల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం ప్రారంభించారు.

ముత్తుకూరు పోలీసుల అత్యుత్సాహం

- రిమాండ్ నిందితుడి విచారణ గదిలోకి టీడీపీ నేతలు
- హత్యాయత్నం కేసులో నీ భార్యను ఇరికిస్తామని బెదిరింపు
- వైఎస్సార్‌సీపీ నేతలు ఉన్నట్లు బలవంతంగా వాంగ్మూలం
- నిందితుడి వాంగ్మూలాన్ని రికార్డు చేయించిన న్యాయమూర్తి

నెల్లూరు(లీగల్): 'పోలీసులు కేసుల విషయంలో జాగ్రతలు తీసుకోవాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టొద్దు' అని పదేపదే న్యాయస్థానాలు హెచ్చరిస్తున్నా.. జిల్లాలోని కొందరు పోలీసులు అధికార పార్టీ ఎమ్మెల్యేల మెప్పు కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారు. తాజాగా ముత్తుకూరు పోలీసులు రిమాండ్ ఖైదీ కస్టడీ విచారణ చేసే సమయంలో టీడీపీ నేతలను గదిలోకి పిలిపించుకుని వైఎస్సార్‌సీపీ నేతల ప్రమేయం ఉన్నట్లు వాంగ్మూలం ఇవ్వకుంటే నీ భార్యను కేసులో ఇరికిస్తామంటూ బెదిరించి తప్పుడు వాంగ్మూలం తీసుకున్న వైనం సంచలనంగా మారింది.

ఇదీ జరిగింది..

ముత్తుకూరు మండలం పంటపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నేత యదనపర్తి శ్యామ్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీకి చెందిన పోలూరు లెనిన్ మధ్య నీటి విషయంలో స్పర్ధలు ఉన్నాయి. ఈ క్రమంలో లెనిన్, ఆయన ఇద్దరు కుమారులు దిలీప్, సందీప్ కలిసి జూన్ 23న శ్యామ్‌పై దాడి చేశారంటూ ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మరుసటి రోజు అరెస్ట్ చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో లెనిన్‌ను పోలీస్ కస్టడీ కోరుతూ ముత్తుకూరు పోలీసులు నెల్లూరు 4వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ (ఇన్‌చార్జ్) కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు న్యాయమూర్తి లెనిన్‌ను ఈ నెల 12, 13 తేదీల్లో పోలీస్ కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు ముత్తుకూరు పోలీసులు ఆ రెండు రోజులు లెనిన్‌ను న్యాయవాది శ్రీధర్‌రావు సమక్షంలో విచారణ చేశారు. అయితే ఈ నెల 13న సాయంత్రం విచారణ పూర్తయిందని చెప్పడంతో న్యాయవాది శ్రీధర్ వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన కాసేపటికి ముత్తుకూరు టీడీపీ నేతలు పి.రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. రిమాండ్‌లోని నిందితుడిని విచారించే సమయంలో పోలీసులు ఎవరినీ అనుమతించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ, న్యాయమూర్తి ఆదేశాలు ధిక్కరించి, చట్టాన్ని అతిక్రమించి టీడీపీ నేతలతో సదరు నిందితుడిని బెదిరించేందుకు బరితెగించారు. టీడీపీ నేతలు పోలీసుల సమక్షంలోనే 'నీవు ఈ కాగితాలపై సంతకం చెయ్. లేదంటే నీ భార్యను కూడా ఈ కేసులో ఇరికిస్తాం' అంటూ బెదిరించారు. కస్టడీ అనంతరం పోలీసులు లెనిన్‌ని కోర్టులో హాజరు పరిచినప్పుడు న్యాయమూర్తి ఎదుట కస్టడీలో జరిగిన విషయాలను వెల్లడించారు. దీంతో న్యాయమూర్తి లెనిన్ వాంగూలాన్ని రికార్డు చేయించారు.

లెనిన్ వాంగ్మూలం చూస్తే..

'నేరం ఒప్పుదల మహజరునామలో పోలీసులు ఏమి రాసింది చదివి వినిపించలేదని, ఆయన్ను బెదిరించి సంతకాలు పెట్టించుకొన్నారని స్పష్టమవుతోంది. ఇందులో ముత్తుకూరు మండల పంటపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలపాటి శీనయ్య, బ్రహ్మానందం, రావి విజయకుమార్‌రెడ్డి, మేడిచర్ల రంగయ్య, ప్రభాకర్‌నాయుడు ప్రోద్బలంతో లెనిన్ ఆయన కుమారులు కలిసి శ్యామ్‌రెడ్డిపై దాడి చేసినట్లు నేరం ఒప్పుదల పత్రంలో ఉంది. ఈ కేసులో వారు కూడా ఉన్నట్లు ఉంది. దీన్ని బట్టి పోలీసులు అధికార పార్టీకి ఊడిగం చేస్తూ, న్యాయవ్యవస్థనే అపహాస్యం చేస్తున్నారని అర్థమవుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నమ్ముకుని, భారత రాజ్యాంగ వ్యవస్థ అయిన న్యాయవ్యవస్థ స్థాయిని దిగజార్చుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్‌జీటీ ఆదేశాలు అమలు చేయండి

- స్ట్రీట్ వెండింగ్ ఫెయిల్యూర్ ప్రాజెక్ట్
- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి వినతిపత్రం అందజేత



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (అర్బన్): నగరంలోని మైపాడుగేటు సెంటర్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్న స్ట్రీట్ వెండింగ్ ప్రాజెక్ట్ నిర్మాణ విషయంలో జాఫర్ సాహెబ్ కెనాల్‌లో జల కాలుష్యాన్ని నివారించేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆ పార్టీ స్థానిక నాయకులతో కలిసి శనివారం రాత్రి కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను అందజేశారు. అనంతరం కలెక్టర్‌తో చర్చిస్తూ ఎన్‌జీటీ నిబంధనలు పాటించకపోతే 43 వేల ఎకరాలకు నీరందిస్తున్న జాఫర్‌సాహెబ్ కాలువ పూడి పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. నీటి కాలుష్యం జరుగుతుందన్నారు. ఇలాంటి నష్టం జరిగే ప్రాజెక్ట్ అనాలోచిత నిర్ణయమన్నారు. అయితే స్ట్రీట్ వెండింగ్ ప్రాజెక్ట్ ద్వారా పేద ప్రజలకు షాపులు కేటాయించేందుకు తీసుకున్న నిర్ణయానికి తాము వ్యతిరేకం కాదన్నారు. ప్రజా ఇబ్బందులు, రైతులకు అన్యాయం జరగకుండా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ ప్రాంతంలో 100 అడుగుల రోడ్డు, కాలువ రివిట్‌మెంట్ వాల్ పూర్తి చేసి వాకింగ్ ట్రాక్, బ్యూటిఫికేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం వాటన్నింటిని మరుగున పడేసిందని విమర్శించారు. స్ట్రీట్ వెండింగ్ ప్రాజెక్ట్ ద్వారా రహదారులు మళ్లీ ఆ క్రమణలు జరుగుతాయని, ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 200 షాపులు ఒకే చోట ఏర్పాటు చేస్తే మొత్తం డ్రైనేజీ జాఫర్‌సాహెబ్ కెనాల్ పూడిపోయి వర్షాల్లో సమీపంలోని ఇళ్లు మునిగిపోతాయన్నారు. రైతుల పంటలకు నీరందదన్నారు. ఈ ప్రాజెక్టు నూటికి నూరు శాతం ఫెయిల్యూర్ అవుతుందని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జిగ జయకృష్ణారెడ్డి, కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలకృష్ణారెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, సోషల్ మీడియా జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, 4, 5, 11వ డివిజన్ ఇన్‌చార్జిలు సంధాని, సుబ్బారెడ్డి, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడితే
అంతిమ విజయం




గాంధీబొమ్మ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

- జీఓల అమలు కోసం సమ్మె చేయాల్సి రావడం విచారకరం
- కాంట్రాక్టర్ల జేబులు నింపడం కోసం కార్మికుల్ని బానిసలుగా మార్చడం తగదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

నెల్లూరు (బారకాసు): కార్మికుల ఐక్యంగా పోరాడితే విజయం తప్పక సాధించి తీరుతారని, అంతిమ విజయం కార్మికులదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సీపీఎం తరఫున సంఘీభావాన్ని తెలియజేశారు. శనివారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన చేపడుతున్న కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులను కలిసి వారి మద్దతును ప్రకటించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి విగ్రహం సెంటర్, నర్తకీ సెంటర్, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం మీదుగా భారీ ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు రోజుల నుంచి కార్మికులు విధులు బహిష్కరించి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించమని నిరసనను తెలియజేస్తుంటే పురపాలక శాఖ మంత్రి నారాయణ ఉత్సవాల్లో పాల్గొనడం విచారకరమన్నారు. కార్మికులతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు సమయం కేటాయించకపోవడం మంచి పద్ధతి కాదని విమర్శించారు. జీఓ నంబరు 36 ప్రకారం ఇంజినీరింగ్ విభాగం కార్మికుల జీతాలు పెంచాలని, మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు నిండాయనే నెపంతో ఒక్క రూపాయి కూడా రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వకుండా నిర్దాక్షిణ్యంగా విధుల నుంచి నిలిపివేయడం దారుణమన్నారు. కార్మికులకు గ్రాట్యూటీ, పెన్షన్, వారసులకు ఉద్యోగాలు తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల కింద బానిసలుగా కార్మికులను మార్చే ప్రయత్నాన్ని ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ సీఐటీయూ నెల్లూరు నగర కార్యదర్శి జి నాగేశ్వరరావు, నగర నాయకులు పి సూర్యనారాయణ, కాయంబు శ్రీనివాసులు, అత్తిమూరి శ్రీనివాసులు, రూరల్ నాయకులు సుధాకర్ శివాజీ, మున్సిపల్ వర్కర్ సీనియర్ నాయకులు తాళ్లూరి రమేష్, మట్టిపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల రెండు రోజుల కస్టడీకి కాకాణి

- విరువూరు మద్యం కేసు



నెల్లూరు (లీగల్): మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పొదలకూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీస్ అధికారుల విచారణ నిమిత్తం రెండు రోజులు (21, 22 తేదీలు) కస్టడీకి ఇస్తూ గూడూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బీవీ సులోచనరాణి శనివారం ఉత్తర్వులిచ్చారు. గత ఎన్నికల ముందు పొదలకూరు మండలం విరువూరులో మద్యం అక్రమ నిల్వలను ఉంచారంటూ నమోదు చేసిన అక్రమ కేసులో కాకాణిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పొదలకూరు ఎక్సైజ్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై పోలీసుల తరఫున స్పెషల్ పీపీ వి. లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ఈ కేసులో గోవర్ధన్‌రెడ్డి పాత్ర ఉందని విచారించడానికి ఏడు రోజులు కస్టడీ అవసరం ఉందన్నారు. కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, పి ఉమామహేశ్వరరెడ్డి, ఎం వీ విజయలక్ష్మి, సిద్ధన సుబ్బారెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్షతో కాకాణిని 9వ నిందితుడిగా పోలీసులు చేర్చారని పోలీస్ కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వాదనలు వినిపించరు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డిని రెండు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాకాణిని ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకోవాలని, 22వ తేదీన విచారణానంతరం సాయంత్రం 5 గంటల వరకు కాకాణికి వైద్య పరీక్షలు చేయించి మెడికల్ సర్టిఫికెట్‌తో కోర్టులో హాజరు పరచాలని, విచారణ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. న్యాయవాది సమక్షంలో గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు విచారణ చేయాలన్నారు.




ఉదయం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు.. మధ్యాహ్నానికి ఇలా మాయమై..



వాగు పోరంబోకు భూమిలో జరిగిన నిర్మాణాలు

అలా పెట్టారు.. ఇలా తొలగించారు

- వాగు పోరంబోకు భూమి కబ్జా
- హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు
- గంటల వ్యవధిలో తీసేసిన వైనం

కొండాపురం(ఉదయగిరి): కొండాపురం మండల కేంద్ర నడిబొడ్డులో అత్యంత విలువైన ప్రభుత్వ వాగు పోరంబోకు భూమి కబ్జాకు గురైంది. ఇలా కొల్లగొట్టిన రెండెకరాల్లో వాణిజ్యావసరాల నిమిత్తం కొంతమేర కట్టడాలను నిర్మించారు. సుమారు రూ.కోటి విలువజేసే ఈ భూమిని కొట్టేయడం వెనుక అధికార పార్టీకి చెందిన ఓ యువ నేత ప్రమేయముందనే ఆరోపణలున్నాయి.

ఇదీ తీరు..

కొండాపురం మండలం గానుగపెంట రెవెన్యూ పరిధిలోని కలిగిరి – కొండాపురం రోడ్డు మార్గంలో సర్వే నంబర్ 18 రెవెన్యూ రికార్డుల్లో వాగు పోరంబోకు భూమిగా ఉంది. దీనిపై కన్నేసిన ఓ స్థానికుడు దాన్ని దక్కించుకోవాలనే లక్ష్యంతో రెండు నెలల క్రితం చదును చేశారు. చుట్టూ హద్దులను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం అందులో కట్టడాలను నిర్మించారు. ఇంత జరుగుతున్నా, రెవెన్యూ అధికారులకు మాత్రం కనిపించలేదు. విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారుల దృష్టికి స్థానికులు తెలియజేశారు.

గత్యంతరం లేక..

దీంతో గత్యంతరం లేక తహసీల్దార్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు సదరు భూమిలో బోర్డును రెవెన్యూ అధికారులు శనివారం ఏర్పాటు చేశారు. ఇది ఉదయం జరగ్గా, మధ్యాహ్నంలోపే దీన్ని పీకేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని రెవెన్యూ అధికారి కొండయ్య తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పేరిట మోసాలు

- అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): మున్సిపల్ కమిషనర్ పేరిట వ్యాపారుల నుంచి నగదును కాజేస్తున్న మోసగాడ్ని దర్గామిట్ట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. వైఎస్సార్ కడప జిల్లా కోడూరు మండలం రామచంద్రాపురానికి చెందిన బిల్లా నాగేశ్వరరావు సులభ పద్ధతిలో నగదు సంపాదించేందుకు గానూ మున్సిపల్ కమిషనర్ అవతారమెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మున్సిపల్ కమిషనర్ పేరిట వ్యాపారులకు ఫోన్ చేసి టాక్స్ తాలూకు బకాయిలను వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేసేవారు. క్యూఆర్ కోడ్‌ను పంపి అందులో డబ్బులు వేయించుకొని మోసగించేవారు. అతనిపై ఇప్పటికే బీ కోడూరు, బద్వేల్, కడప, గుంతకల్, తెలంగాణలోని గద్వాల్‌లో కేసులున్నాయి. తాజాగా నెల్లూరుకు చెందిన హైరర్స్ యజమాని రియాజ్‌బాషాకు మున్సిపల్ కమిషనర్ పేరిట నిందితుడు గత నెల 17న ఫోన్ చేశారు. మీ పేరుపై రూ 2100 బకాయి మున్సిపాల్టీకి ఉందని, తాను పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వెంటనే చెల్లించాలని సూచించారు. తాను ట్రేడ్ లైసెన్స్‌ను చెల్లిస్తున్నానని రియాజ్ చెప్పినా, వినిపించుకోకుండా వెంటనే నగదు చెల్లించాలని చెప్పారు. దీంతో ఆయన నగదు చెల్లించారు. కొద్దిసేపటికే నిందితుడు మరోసారి ఫోన్ చేసి మరో రూ.1200ను చెల్లించాలని కోరడంతో అనుమానంతో కార్పొరేషన్లో రియాజ్ ఆరాతీశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రోశయ్య కేసు దర్యాప్తు చేపట్టారు. పాదలకూరు రోడ్డు వద్ద నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

నెల్లూరు(అర్బన్): ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంతో అనేక అనర్థాలు సంభవిస్తున్నాయని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో చెత్తాచెదారాలను డాక్టర్లు, ఉద్యోగులతో కలిసి శనివారం తొలగించిన అనంతరం ఆమె మాట్లాడారు. కవర్లకు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులను వినియోగించాలని కోరారు. అనంతరం స్వచ్ఛాంధ్ర సాధన కోసం కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీపీఎంఓ రమేష్, డీఐఓ ఉమామహేశ్వరి, న్యూక్లియస్ డాక్టర్ సురేంద్ర, డీఎంఓ హుస్సేనమ్మ, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ సుజాత తదితరులు

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి, పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం 1800 – 425 – 0017 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేశామని డీపీఓ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ గ్రామాల్లో సమస్యలుంటే ఈ నంబర్‌కు తెలియజేయాలని, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించనున్నారని చెప్పారు.

యువకుడి దారుణహత్య

- స్నేహితుడే నిందితుడు..?



వంశీకృష్ణ (ఫైల్)



రక్తపు మడుగులో మృతదేహం

నెల్లూరు (క్రైమ్): యువకుడు దారుణహత్యకు గురైన ఘటన నగరంలోని భగత్‌సింగ్‌కాలనీ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. స్థానికంగా నివాసం ఉంటున్న మణి, కుమారి దంపతులకు కుమార్తె, కుమారుడు వంశీకృష్ణ (24) సంతానం. కేటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తన భార్యతో కలిసి కిసాన్‌నగర్‌లోని కుమార్తె ఇంటికి మణి శుక్రవారం వెళ్లారు. రాత్రి వంశీకృష్ణ ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఏమి జరిగిందో తెలియదు గానీ దారుణ హత్యకు గురయ్యారు. తలపై బలమైన ఆయుధంతో కొట్టడం, కత్తులతో విచక్షణరహితంగా దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమై మృతి చెందారు. వంశీకృష్ణకు తల్లిదండ్రులు శనివారం ఉదయం ఫోన్ చేయగా, ఆయన స్పందించలేదు. దీంతో ఇంటికొచ్చి చూడగా రక్తపు మడుగులో కుమారుడు విగతజీవిగా పడి ఉండటంతో కన్నీరుమున్నీరయ్యారు. ఘటనపై నవాబుపేట పోలీసులకు వారు సమాచారం అందించారు. నగర డీఎస్పీ సింధుప్రియ, ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. హత్యకు దారి తీసిన పరిస్థితులపై విచారణ చేపట్టారు.

స్నేహితుడే నిందితుడు..?

మధురానగర్‌కు చెందిన ఓ యువకుడు, వంశీకృష్ణ స్నేహితులు. వీరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలున్నాయని తెలిసింది. ఈ నేపథ్యంలో స్నేహితుడి ఇంట్లోని వస్తువులను వంశీకృష్ణ శుక్రవారం ధ్వంసం చేశారు. దీంతో వీరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని తెలిసింది. దీంతో స్నేహితుడే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉండొచ్చనే అనుమానాల నేపథ్యంలో ఆ దిశగా పోలీసులు విచారణ చేపట్టారు. స్నేహితుడు అందుబాటులో లేకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మొక్కలు నాటడాన్ని బాధ్యతగా భావించాలి

వెంకటాచలం: మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీత పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు సమీపంలో గల వర్సిటీ పరిసర ప్రాంతాల్లో మొక్కలను శనివారం నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యత చేపట్టాలని కోరారు. ఎన్నెస్సెస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అధికారులు

నిమ్మ ధరలు

పెద్దవి: రూ.25
సన్నవి: రూ.15
పండ్లు: రూ.5



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 126
లేయర్ (లైవ్) : 112
బ్రాయిలర్ చికెన్ : 226
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 250
లేయర్ చికెన్ : 190




అర్హులకు సంక్షేమ పథకాలందాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భారతి

ఉలవపాడు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, బాలల సంరక్షణ హక్కులపై రామాయపట్నంలోని పల్లెపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం అవగాహన కల్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. 14 ఏళ్లలోపు వారికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని సూచించారు. పిల్లలకు మొబైల్ ఫోన్‌ను ఇవ్వొద్దని కోరారు. బాలికలపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు సహకరించాలని పేర్కొన్నారు. న్యాయసాయాన్ని ఉచితంగా పొందేందుకు న్యాయసేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ మాట్లాడారు. గ్రామ్ సడక్ యోజన ద్వారా ప్రతి గ్రామానికీ రోడ్డును వేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్, కందుకూరు, కనిగిరి జడ్జిలు శోభ, రూపశ్రీ, పంచాయతీ కార్యదర్శి మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో డాక్టర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ



హాజరైన డాక్టర్లు

నెల్లూరు(అర్బన్): గతానికి భిన్నంగా వైద్యుల వద్దకే వస్తూ ప్రతి జిల్లాలో డాక్టర్లకు సంబంధించిన రీ రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్, రెన్యువల్ సర్టిఫికెట్లను అందిస్తున్నామని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో డాక్టర్ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం చేపట్టారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులు హాజరయ్యారు. ఆరు కౌంటర్లను ఏర్పాటు చేసి 300 మందికి తొలి రోజు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేదని, తొలి సారిగా అన్ని జిల్లాల్లో చేపట్టామని వెల్లడించారు. ఐదేళ్లు పైబడిన వైద్యులందరూ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. గతంలో రీ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉండేదని, ప్రస్తుతం 75 ఏళ్లలోపు ఉన్న వారు రూ.ఎనిమిది వేలు, 75 ఏళ్లు పైబడిన వారు రూ.ఆరు వేలే చెల్లించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు అశోక్‌రెడ్డి, పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.